# లవ్ స్టోరీ

**'తృప్తి'**

కళ్లింకా మంటలుగా ఉన్నాయి. దాన్ని మించిన కడుపు లోని మంట. రెండు రోజుల చిత్ర హింస తరువాత అరవై రూపా యిలు మొఖాన కొట్టారు. మండు టెండలో తారు డబ్బాలు పట్టు కొని రోడ్లు వేసే కూలివాళ్ల ఆర్తీ, ఆకలవుతోందని గగ్గోలు పెట్టినా వినకుండా అర్ధరాత్రి దాటినా అవ యవాలన్నింటినీ నలిపేసే విటుడి రాక్షసరతిలో శిథిలమయిపోయే అభాగినుల ఆక్రోశం ఇంకెంత దారుణంగా ఉంటాయో.

మెల్లగా లేచాను. కాఫీ ఉంటేబావుణ్ణు. ఎప్పుడో నిద్రలోనే ఒకసారి తాగినట్లు గుర్తు. టైముచూసుకున్నాను. పదకొండు. ఈమెగారు పాపని తీసుకుని స్కూలుకు వెళ్ళిపోయింది గాబోలు. పాప కూడా ఆ స్కూల్లోనే కావడం కొంతలో కొంత నయం. టేబులు మీద రెండు గిన్నెల్లో కూరల్నీ, ఒకదాన్లో అన్నాన్నీ చూసేటప్ప టికి ఆకలి మరింత విజృంభించింది.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను. కుంకుడు కాయలు నాన బెట్టిన పాత ఇత్తడి గిన్నె చూసేటప్పటికి శ్రీమతిగారి ఇన్‌స్ట్రక్షన్స్ కొద్దికొద్దిగా జ్ఞాపకం వచ్చాయి. "నూనె రాసుకోండి. సున్నిపిండి పెట్టాను. శుభ్రంగా తలకి పోసుకొని భోంచేసి కదలకుండా పడుకోండి బడలిక తగ్గు తుంది"

ఇది మామూలు బడలికా? లారీలో అంతదూరం పోయేప్పటికి వొళ్లు హూనమయిపోయింది. బాలెట్ బాక్సులున్న గోతాములు మోసుకుంటూ వెళ్లి, ఆ చలిలో నిద్ర లేకుండా కాపలా కాసిన తీరు గుర్తుకొస్తే నామీద నాకే జాలేస్తోంది. పైగా అలా లారీల్లో పైన టాపు లేకుండా గొడ్లను తీసుకెళ్లినట్లు తీసుకెళ్లడం conveyance అట. మర్నాటి ఉదయం నుంచీ సాయంకాలం వరకు ఊపిరి సలపని పోలింగ్. రెండు మూడు సార్లు టీ నీళ్ళు పోయించారెవ్వరో. ఎవరో కూడా తెలుసుకునే తీరిక లేదు. పైగా ప్రతి తాగుబోతు వెధవా, పనికి మాలిన వవటా పోట్లాటకు దిగడం, మీద మీదికి రావడం. కడపలో ఒక పోలింగ్ ఆఫీసర్ని చంపేసారు. మరొకాయన చెయ్యి నరికేశారు. ఏమిటీ దారుణం! మానవాళి రాక్షస రూపమెత్తిన వేళ.


దాదాపు అంత అనుభవమూ అయింది నాక్కూడ. "నా యిట్టమొచ్చినన్ని వోట్లు ఎయ్యనిత్తావా. ఈ పెట్టె నీ నెత్తిన కొట్టమంటావా?..." భీకరంగా అరుస్తూన్న ఆ ఆకారాన్ని చూస్తూ చేష్టలుడిగిపోయాం. ఊగిపోతు న్నాడు. ఈ క్షణమో, మరుక్షణమో, అంత పనీ చేసేట్టు న్నాడు. "ఈ పెట్టెను నా ముందెందుకు పెట్టావ్రా దేవుడా..." అనుకున్నాను. కాస్త ధైర్యం తెచ్చుకుని "అలాగే వేద్దువుగాని. కాని ఈ రద్దీ తగ్గనియ్యి. లేకపోతే వాళ్ళందరు కూడా అడుగుతారు" అన్నాను.

"ఊ...ఎవడాడు...అడిగేది..." మునిగాళ్ళమీద లేస్తూ గర్జించాడు. ముక్కు బద్దలయిపోయే సారా కంపు. ఎలక్షన్స్ ఎనౌన్సు చేసిందగ్గర్నుంచీ తాగుతూనే ఉన్నా డేమో. ఏజంట్లు చోద్యం చూస్తూ కిమ్మనకుండా కూర్చున్నారు. మేమేగదా నాశనమయ్యేది. ఆ చావంతా మేమే పడాలి. మొత్తం మీద ఒక మూల బల్లమీద గోడకు ఆనుకునేట్లు అతన్ని కూర్చోబెట్టాము.

"మోసం జేసారో..." అందరికీ మూడిందన్నట్టు వార్నింగ్ ఇచ్చాడు. కాని మా అదృష్టం. ఆ బల్లమీద పడి నిద్రపోయాడు. మా లారీ బయలుదేరేప్పటికూడ లేవలేదు.

స్నానం పూర్తయింది. తిండికి ఉపక్రమించాను. వంకాయ కూర గిన్నెలో మూడొంతులు నిండుగా వుంది. రంగు, వాసన చూడగానే అర్థమైపోయింది. అది ఆరోజు స్పెషల్ అని. సగానికి పైగా వేసుకున్నారు. చాలా రుచిగా వుంది. తినేసింతర్వాత ఇంకా జిహ్వా చాపల్యం చంపుకోలేక మిగిలింది కూడా వేసుకుని తినే సాను. బ్రహ్మాండంగా ఉంది. 'కావాలంటే రాత్రికి మరో కూర వండుతుందిలే. నాలాగా ఎలక్షన్ కష్టం పడిందా ఏమన్నానా" అనుకున్నాను. కాని కాలిఫ్లవర్ కూర ఇంకా బావుంది. అరెరె...ఇది ముందు తిని ఉంటే ఎంత బావుండేది. ఏదైమైనా ఈ ఆడవాళ్ళు దేవతలు. అందుకేనేమో ఈ అమృతం. ఇంత బాగా ఎలా వండగలుగుతారో! చేతుల్తో మాత్రం కాదు. వాళ్ల హృదయంతో. ఉప్పు, కారం వేసే ముందు ప్రేమా భిమానాలను ముందు కలుపుతారనుకుంటా. మెతుకు మిగల్చకుండా తినేస్తే ఎంత సంబరపడిపోతారో! నిజంగా అలాగే అయింది. గిన్నెలన్నీ ఖాళీ అయ్యాయి. అవన్నీ ఒక ప్రక్కగా క్రింద సర్దుదామనుకున్నాను కాని బద్ధకం. 'అన్నీ కదుక్కునేవే గదా, ఇక్కడుంటేనేం?" బల్లమీదే వదిలేసాను. స్టీలు చెంబులో నీళ్ల మాత్రం కాసిని, కాసిని అన్నింట్లోకీ వొంచాను ఎండిపోకుండా.

తలుపులేసేస్తే ఏమీ లోపలకు రాకుండా ఉంటాయి. నా దారిని నేను ముందు గదిలో ఏ డిస్టర్బెన్స్ లేకుండా పడుకోవచ్చు. ఏదో బయట అలికిడి. "అప్పుడే వచ్చిందా ఏమిటి ఈ పిల్లి?" తలుపు తీసాను. ఇద్దరు పిల్ల



వెధవలు.

"ఏమిట్రా మీరొచ్చారు"

"మరండీ మా అమ్మ పడింది. చెయ్యి వాచి లేవలేదండి. నిన్న కూడా రాలేదు. ఇయాల మమ్మల్ని పంపింది" అన్నారు బిక్కుబిక్కు మంటూ. గబగబా బాత్‌రూమ్ పక్కనున్న పంపుదగ్గరతొంగిచూశాను. ఒక

రచయిత చిరునామా:
ఎ.వి.శేషగిరిరావు
66-5-6, పటమట, విజయవాడ

పెద్ద బక్కెట్ నిండా ఉతకాల్సిన బట్టలు. పక్కనే బండెడు అంట్లు. రెండు రోజులవి కాబోలు. " పని మనిషెందుకో రాలేదండీ..." అని అన్నదా? అన్నట్లు గానే ఉంది. అనే ఉంటుంది!!

"ఇవన్నీ మీరు ఉతికేసి, అంట్లు కడగ్గలర్రా" అని అడిగాను. చూస్తే పీలగా, చిన్నగా ఉన్నారు. ఇద్దరూ మాట్లాడకుండా తలలూపారు చేస్తామన్నట్టు. 'వద్దులే పొండి' అందామనిపించింది. కాని మా ఆవిడ తిరిగి వచ్చి నన్ను ఉతికేస్తే? ఎలా పాపం వీళ్లకి.

"ఎంతసేపయిందిరా వచ్చి...పిలవలేదేం"

"మీరు అన్నం తింటున్నారండీ"

గతుక్కుమన్నాను. తలుపు సందులోంచి నా తిండి ప్రహసనం చూసే ఉంటారు. మళ్ళీ ఇంకో ఆలోచన. గిల్టీగా ఫీలవుతూ...

"మీరు భోజనం చేసార్రా...?" ఒకరి మొహాలు



ఒకరు చూసుకున్నారు. అప్పుడు వెలిగింది. వాళ్లమ్మ పనిచేసి మిగిలిన కూరలూ, అన్నం పట్టుకుపోతూం టుం ది. వంటింట్లో అన్నీ వెదికాను. అల్మైరాల్లో చూసాను. ఎందులోనూ కాస్త అన్నం కూడా కన్పించ లేదు. నిస్సహాయంగా వాళ్లవైపు చూశాను. ఈసారి మరీ వకవకలాడుస్తూ కన్పించారు. ఏమైనా పెడితే? ఏము న్నాయి?! ఏమీ కన్పించలేదు! బెల్లం ఉంది", చిన్న తనంలో బెల్లం తెగ తినేవాణ్ణి నేను. "అదేం చిరు తిండిరా...పాడు..." అని అమ్మ తిట్టేది. చెరొక బెల్లపు గడ్డ ఇస్తే! అటూ ఇటూ తిరుగుతూ ఫ్రిజ్ తెరిచాను. పెద్ద గిన్నె కన్పించింది. మూత తీసి చూద్దును గదా. నా సంతోషానికి హద్దు లేదు.

"ఒరే, ముందు రెండు పళ్లేలు కడుక్కురండిరా" అని అరిచాను.

దాన్నిండా పరమాన్నం ఉంది. నిన్నటిదనుకుంటా. ఎలక్షన్ నుండి వచ్చే శ్రీవారి కోసమని వండి ఉంచింది కాబోలు. నేనేమో రావడం రావడం మంచం మీద పడి పోయాను. ఇంక అలాగే వుంచేసింది. ఫ్రిజ్‌లో పెట్టిం దాన్ని వాళ్లిద్దరూ తినరు. తింటే జలుబు. నేనే తినాలి ఎప్పుడైనా. కొంచెం రుచి చూసాను. బావుంది. చల్లగా వుంది ఐస్‌క్రీమ్‌లా.

వాళ్ల పళ్లేల నిండా కుమ్మరించాను. తెల్లబోయి చూసారు. "తినండి" అన్నాను. ముందు సంకోచంగా, ఆ తరువాత సంతోషంగా కడుపు నిండా పట్టించారు. నా మనసు కూడా నిండినట్లనిపించింది.

మా ఆవిడ ఎక్కడో దాచుకున్న సర్ఫ్ పాకెట్‌ని బయటకి లాగాను. బట్టలకు అంట్లకు సబ్బు పడే స్తుంది ఒక గంటకల్లా ముగ్గురం కలిసి బట్టలన్నీ ఉతికి ఆరేసి, అంట్లన్నీ కడిగేసాం. "నిన్న చేసిన పనికన్నా హీనమా ఇది" అనుకుంటూంటే, రెండు మూడు సంఘటనలు గుర్తుకొచ్చాయి. ఇండెలెబుల్ ఇంక్ గుర్తు పెట్టే పోలింగ్ ఆఫీసర్ వట్టి మఫ్. ఎన్నోసార్లు చెప్పాను. ఆడవాళ్ళు వచ్చినప్పుడు వాళ్ల చేతులు పట్టుకోకుండా చుక్క పెట్టాలని. కాని మరీ ఆడవాళ్ల చేతులే పట్టుకుని నొక్కుతూ ఆనందిస్తూండేవాడు. నాకు చాలా అసహ్య మనిపించింది. వాడి మొహం చూడ్డం మానుకుని నా పనిలో మునిగిపోయాను. ఎప్పుడో ఎవరో చెంప పగల గొట్టే చప్పుడు వినకపోతానా అని. ఇంతలో తూలు కుంటూ ఒకడు వచ్చి ఆ టేబిల్ మీద పడడంతో ప్లాస్టిక్ కప్పు, అందులోని ఇసుక, దాని మధ్యలోని ఇంకు సీసా వెళ్లి పోలింగ్ ఆఫీసర్ మీద పడిపోయాయి. ఇక అప్పుడు చూడాలి అతని అవతారం. నా మనసుకు మాత్రం శాంతి లభించినట్లయింది. అన్నీ అలా బ్యాలెన్స్ అయిపోతూ ఉంటే జీవితానికి బావుంటుంది. పోలింగ్ పూర్తయింతర్వాత కవర్లు అంటిస్తున్నాం. చేతు ల్నిండా జిగురు. ముఖంమీద ఏదో పురుగు వాల్తే గభాల్న తుడుచుకున్నాను. అదంతా ముఖానికయింది. లక్క సీలు వేసే ఆయనా, కాండిల్ పట్టుకున్నాయనా కనీసం నాలుగుసార్లయినా చేతులు కాల్చుకున్నారు.

వాటిని తల్చుకుంటూ ఈ మసితో, జిడ్డుతో ఆనందంగానే కాస్సేపు కాలక్షేపం చేసాను.

'ఎల్తన్నామండీ' అన్న వాళ్ల ముఖాల్లోకి చూసాను. చాలా సంతోషంగా ఉన్నారు. చెరొక రూపాయి ఇచ్చి పొమ్మన్నాను. ఎగురుకుంటూ పరుగెత్తారు. రెండు రోజుల్నించీ అనుభవిస్తున్న మానసిక వేదన ఎటు పోయిందో. హాయిగా **feel** అయ్యాను.



* "బస్సు ప్రయాణం కంటె, విమాన ప్రయాణం సుఖమా. ఏం చేత"

"బస్సు యింజను ఆగిపోతే దిగి వెళ్ళాలి. విమానం యింజను ఆగిపోతే ఆ అవసరం లేదు కదా."

* "హెలికాప్టర్ పైన అంత పెద్ద ఫానెందుకు"

"హెలికాప్టరు ఎగురుతూ సూర్యుడికి దగ్గరగా పోతే వేడి ఎక్కువవుతుంది కదా. ఆ వేడిని చల్లార్చేందుకు"

* "లలితా, నీ ముస్తాబు పూర్తయేసరికి విమానం టైమయి బయలుదేరిపోతుంది"

"విమానంలో బాంబువుందని ఫోన్ చెయ్యండి. వాళ్ళే ఆపుతారు"

* భార్య: రేపు ఏ విమానంలో బయలుదేరుతున్నారండీ.

భర్త: దేన్లో టిక్కెట్టు దొరికితే, దానికే వెళతాను, శశీ.

* భార్య: బాగుంది, అలా క్కాదు. దేంట్లో యిన్సూరెన్సు ఎమౌంటు ఎక్కువ యిస్తారో కనుక్కుని దాంట్లో వెళ్ళండి.

* "అదేమిటే, విమానం ఎక్కుతూ బెల్టు తెస్తున్నారు"

"మా ఆవిడకు మీరిచ్చే బెల్టు సరిపోతుందో లేదో నని"

* "ఏమిటలా విమానంలో పైకి చూస్తున్నారు"

"విమానం ఆపాలంటే, లాగడానికి, గొలుసు ఎక్కడుందా అని"

* "ఏ చెవిలో బాంబుందని తెలుసు. హైదరాబాదో, విశాఖపట్టణమో, విజయవాడో, విమానాన్ని తీసికెళ్ళగలను. కానీ పిట్టలవానిపాలెంకు హైజాకు చేయడం కుదరదు బాబూ.

* "ఆయన్నెందుకలా ఊరేగిస్తున్నారు"

"ఇప్పటికి మూడు సార్లు విమాన ప్రయాణం చేసి, క్షేమంగా ఉన్నాడు."

— "వసు" గుంటూరు